క్లుప్తంగా

శివపార్వతుల విగ్రహాల వితరణ



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో ఆలయానికి శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను బుధవారం గౌని నాగిరెడ్డి దంపతులు ఆలయ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డికి ఆలయంలో అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాగితాల రాంరెడ్డి, కోట్ల రాం రెడ్డి, బీసన్న, మంగలి కృష్ణయ్య, బాల కృష్టా రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు



పెబ్బేరు రూరల్: గ్రామంలో నిర్మించే సీసీ రోడ్డు పనులను నాణ్యవంతంగా చేపట్టి క్యూరింగ్ సరిగా చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ కాంట్రాక్టర్‌కకు సూచించారు. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో రూ.34 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే సీసీ రోడ్ల పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఉపాధి నిదుల నుంచి రూ.34 లక్షలను గ్రామానికి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కురుమన్న, రాజుగౌడ్, కృష్ణకుమార్‌రెడ్డి, మద్దిలేటి, వెంకటయ్య, ఎల్ల స్వామి, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వీపనగండ్ల: మండలంలోని తూంకుంట ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. తూంకుంట గ్రామానికి చెందిన సుధాకర్, మరో ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన రెవెన్యూ సిబ్బందిని ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల వద్దకు పంపించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారని ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



అమరచింత: పట్టణానికి చెందిన సుదర్శన్ చార్మినార్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టడం పట్టణానికి గర్వకారణమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. ఈమేరకు బుధవారం అమరచింతలో ఆయన మిత్ర బృందం మిఠాయిలు పంచిపెట్టి తమ సంతోషం చాటుకున్నారు. ఈమేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ఎస్‌ఐ నుంచి అంచెలంచలుగా పదోన్నతులు పొందుతూ ఉద్యోగరీత్యా గుర్తింపు తెచ్చుకుని ఏసీపీగా బాధ్యతలు స్వీకరించడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్ రాజు తదితరులు ఉన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు: తప్పిన ప్రమాదం



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా సమీపంలో కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్ నుంచి వనపర్తికి వెళ్తున్న కారు అన్నారంతండా సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను తప్పించబోయి సమీపంలోని కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

మదనాపురం: మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం కోస్గిలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు బయలేదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజాద్ అలీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగన్న, మండల ప్రధాన కార్యదర్శి జగదీష్, జిల్లా మైనారిటీ కార్యదర్శి ఖాజామైనోద్దీన్, కోటేష్, కొండన్న, కాజారాం, సురేందర్‌గౌడ్, తిరుపతి నాయక్, డబ్బా వెంకటేష్, యముడి, ఖదీర్, మాసన్న, సత్యం గౌడ్, గంజి నాగన్న, నందు నాయక్, మొగులన్న తదితరులు వెళ్లారు.

సమస్యల వలయంలో 'కస్తూర్బా'

- నిధులున్నా నిర్మాణానికి నోచుకోని డైనింగ్ హాల్
- తరగతి గదులు, వరండాల్లోనే భోజనాలు
- విద్యాలయం పరిసరాల్లో లోపించిన పారిశుద్ధ్యం



డైనింగ్ హాల్ లేక తరగతి గదిలో భోజనాలు చేస్తున్న బాలికలు

పాన్‌గల్: బాలిక విద్యతో సమాజాభివృద్ధి, పురోగతి ముడిపడి ఉంది. పేదరికం, లింగ వివక్ష, విద్యాలయాల కొరత వంటి కారణాలతో ఆడపిల్లలు చదువుకు దూరం కావొద్దని.. వారు ఉన్నత విద్య దిశగా అడుగులు వేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నవే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు 200 మంది బాలికలు ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ తిష్ట వేసిన సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్య సమన్వయం లేక సమస్య పరిష్కారానికి నోచుకోవట్లేదనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.

ప్రధాన సమస్యలు

విద్యాలయానికి ప్రహారీ గోడ, విద్యాలయానికి ఐదేళ్ల క్రితం డైనింగ్ హాల్ నిర్మాణం కోసం రూ.16.60లక్షల నిధులు మంజూరైన నిర్మాణానికి నోచుకోకపోవడంతో బాలికలు తరగతి గదులు, వరండాల్లో భోజనాలు చేస్తున్నారు. పాఠశాల నుంచి మురుగు బయటకు వెళ్లేందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక దుర్వాసన వెదజల్లుతోందని బాలికలు వాపోతున్నారు.

పొంచి ఉన్న రోగాలు

విద్యాలయంలోని మురుగు నిల్వ ఉండడంతో ఈగలు, దోమల వృద్ధి, పందుల సంచారంతో ఎప్పుడు ఏ రోగాలు సంభవిస్తాయోనని బాలికలు విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యాలయాన్ని సందర్శిస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

డైనింగ్ హాల్ నిర్మించాలి



నిధులు అందుబాటులో ఉన్నా డైనింగ్ హాల్ నిర్మించకపోవడంతో వరండా, తరగతి గదుల్లోనే భోజనం చేస్తున్నాం. దీంతో పాటు సరైన ప్రహారీ గోడ లేకపోవడం విద్యాలయం గుట్టల సమీపంలో ఉండటంతో ఆవరణలోకి కోతులు, పందుల సంచారం ఎక్కువైంది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– లావణ్య, 7వ, తరగతి

అధికారులు స్పందించాలి



విద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించాలి. విద్యాలయంలో డైనింగ్ హాల్, ప్రహారీ గోడ నిర్మాణం, మురుగు నీటి నిల్వ వంటి సమస్యలపై అధికారులు దృష్టి సారించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– జ్యోతి, 10వ, తరగతి

ఉన్నతాధికారులకు విన్నవించాం



విద్యాలయంలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. ఆయా సమస్యలను జిల్లా అధికారులు, మండల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. మరో మారు ఆయా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించి, పరిష్కారానికి కృషి చేస్తాం.

– హేమలత, ఎస్‌ఓ, కస్తూర్బా విద్యాలయం

'ఉపాధి'కి రూ.3 లక్షల కోట్లు కేటాయించాలి



కూలీలతో మాట్లాడుతున్న నిక్సన్

మదనాపురం: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గోవిందహళ్లీలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి దొరుకుతుందంటే ప్రజా పోరాటాలతోనే సాధ్యమైందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలనీ బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, కూలీలకు జీవనాధారంగా ఉన్న ఈ పథకానికి బడ్జెట్ తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు 14 రోజులకు ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాలని, పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మంచినీటి సౌకర్యం టెంటును ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో కూలీలు రాములమ్మ, యశోద, గిరమ్మ, అలివేల, బాలమ్మ, గోవిందమ్మ, కిష్టమ్మ, జయమ్మ, శివమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ఖిల్లాఘనపురం: మండలంలోని గటుకాడిపల్లిలో వెలిసిన శ్రీలక్ష్మీఅలవేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణం, సింహ వాహనం, సాయంత్రం సమయంలో భేరిపూజ, దేవతా ఆహ్వానం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి గరుడ సేవ, ఎదుర్కోళ్లను భక్తుల సమక్షంలో వైభవంగా చేశా. గురువారం దేవాలయం వద్ద స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఉదయం 10 గంటలకు కనులపండువగా నిర్వహిస్తామని అర్చకుడు కన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, శారద దంపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన చెప్పారు. పుష్పయాగం పూర్తిచేసిన తరువాత మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారని, భక్తులు తరలిరావాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ సేవల గురించి అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ హెల్ప్‌లైన్ నంబర్ 1098, 112, 100, 181 అత్యవసర సేవల టోల్ ఫ్రీ నంబర్లను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు అమ్మాయిలను నిర్లక్ష్యం చేయొద్దని, ఆడపిల్లలపై వివక్షత చూపరాదని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అమ్మాయిలు ఉన్నతంగా రాణిస్తున్నారని తెలిపారు. సమాజ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, చైల్డ్ హెల్ప్ లైన్ వర్కర్ రవిరాజు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి అభినందన

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న బత్తుల గౌతం జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో తృతీయ బహుమతిని గెలుచుకోవడంపై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు విద్యార్థిని అభినందించారు. జిల్లా కేంద్రంలో 14 మండలాల విద్యార్థులకు నిర్వహించిన సైన్స్‌టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందించదగ్గ అంశమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



వీపనగండ్ల: మూడు నెలలుగా తమకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే ఇప్పించాలని మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికులు వెంకటయ్య, వీరబాబు, గంగన్న, శంకరమ్మ, దేవమ్మ, సుంకులయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలో పనిచేస్తున్న కొన్ని గ్రామ పంచాయతీల కార్మికులకు వేతనాలు అందాయని, తమకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడం ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

వదంతులు నమ్మొద్దు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలో చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే వార్తలో నిజం లేదని, తప్పుడు ప్రచారం నమ్మొద్దని పట్టణ ఎస్‌ఐ జయన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి వనపర్తి జిల్లా కేంద్రంలో చిన్న పిల్లలను ఎత్తుకుపోవడానికి ఒక ముఠా మహిళ గ్యాంగ్ సంచరిస్తుందనే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వనపర్తిలోని గాంధీ చౌరస్తాలో ఒక మహిళ చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తుంటే స్థానికులు పట్టుకొన్నారని సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె పెబ్బేరు మండలంలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన మహిళ అని, జీవనోపాధి కోసం బొంతలు కుట్టుకోవడానికి వనపర్తిలో తిరుగుతున్న సమయంలో కొంతమంది ఆమెను పట్టుకొని చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా పట్టుకున్నట్లు ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలను మానుకోవాలని, సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలను వైరల్ చేయొద్దని కోరారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. ప్రజలకు ఉపయోగపడే విషయాలను మాత్రమే సోషల్ మీడియాలో పోస్టు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'లెనిన్ జీవితం ఆదర్శం కావాలి'



లెనిన్ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: లెనిన్ జీవిత చరిత్రను తెలుసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రెడ్‌బుక్ డే సందర్భంగా పార్టీ కార్యాలయంలో లెనిన్ జీవిత చరిత్రకు సంబంధించిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా ఎర్ర పుస్తకాల కోసం వెతుకులాట ప్రారంభమైందని, పెట్టుబడిదారి వ్యవస్థ నిర్మూలనకు లెనిన్ అనుసరించిన విధానాలను పలువురు ఆదర్శంగా తీసుకునే పరిస్థితి నేడు నెలకొందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, నాగేష్, ప్రవీణ్‌గౌడ్, తిరుపతయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: లెనిన్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరూ చదవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అజ్జకొల్లులో మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే పురస్కరించుకొని లెనిన్ జీవిత చరిత్ర పుస్తకం చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుదారి వ్యవస్థ విస్తృతమైన నేపథ్యంలో ఆర్థిక సంక్షోభాలకు దారితీసి కార్మిక వర్గం రోడ్డున పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల



అజ్జకొల్లులో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు చెన్నయ్య, వెంకటేష్, చిరంజీవి, భగత్, మన్యం, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు రెడ్ బుక్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. లెనిన్ విప్లవ ఆయుధం అనే పుస్తకంపై అధ్యయనం చేసి కార్మిక వర్గానికి మేలు పంథాను ఎంచుకొని పోరాటం కొనసాగించిన ధీశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేకల ఆంజనేయులు, కురుమయ్య, గట్టయ్య, రాబర్టు, శ్రీనివాసులు, నందిమల్ల రాములు, కురుమయ్య, మన్యం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూర్: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా రాణించేందుకు లక్‌పతి దీదీ కార్యక్రమం చేపడుతున్నామని డీపీఎం అరుణ, ఏపీఎంలు కృష్ణవేణి, శ్రీనివాసులు, వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఆత్మకూర్, అమరచింత మండలాల స్వయం సహాయక సభ్యులకు, వీఓఏలకు లక్‌పతి దీదీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ 23న రాజస్థాన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా లక్‌పతి దీదీ కార్యక్రమం ప్రారంభించిందని వెల్లడించారు. నిరుపేద మహిళా సభ్యులను గుర్తించి జీవనోపాధికోసం రూ.5 లక్షలు వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నారని వివరించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో చేపడుతున్న లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు ఆంజనేయులు, అన్వర్, తిరుపతమ్మ, బీసన్న, వీఓఏలు, మహిలాసమాఖ్య సభ్యులు ఉన్నారు.



రైతులు అప్రమత్తంగా ఉండాలి



మిట్టనందిమళ్ల శివారులో వరి పంటలో నీటి నిల్వను చూపుతున్న ఏఓ

అమరచింత: యాసంగిలో వరిపంటను సాగుచేస్తున్న రైతులు పంటకు సోకుతున్న సల్ఫైడ్ ఇంజూరిపై అప్రమత్తంగా వ్యవహరించి, నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వినయ్ సూచించారు. మండలంలోని మిట్టనందిమళ్లలో వరి సాగు చేసిన రైతులకు బుధవారం సల్ఫైడ్ ఇంజూరిపై అవగాహన కల్పించారు. పంట పొలాల్లో అధికంగా నీటి నిల్వ ఉండరాదన్నారు. అదే విదంగా సల్ఫర్ అధికంగా ఉండే 20:20:0:13 తో పాటు అమ్మోనియం లాంటి వాటి ద్వారా ఎక్కువగా ప్రభావం చూపిస్తుందన్నారు. వరిలో సల్ఫైడ్ ఇంజూరి నివారణ కోసం 13:0:45 ను 5 గ్రాములను లీటర్ నీటిలో, 25 కిలోల యూరియాలో 150 గ్రాములు వినియోగించి పిచికారీ చేయాలన్నారు. అంతే కాకుండా కార్బొండిజంతో మ్యాంకోజెబ్‌ను కలిపి పంటలపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్వారెడ్డి, ఏఈఓ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన గట్టుయాదవ్‌కు చెందిన పూరిగుడిసె ఇటీవల గ్యాస్ సిండర్ పేలి పూర్తిగా దగ్ధమైంది. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం బాధితుడి దగ్గరకు వెళ్లి ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలసుకోవడంతో పాటు గుడిసెలో సర్వం కోల్పోయిన గట్టుయాదవ్‌కు ఎమ్మెల్యే మానవత దృక్పదంతో రూ.50వేలు ఆర్థికసాయం చేశారు. అదేవిధంగా ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రెడ్డి, పీజే బాబు, పి.కృష్ణారెడ్డి, బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, రాములుయాదవ్, రాములుసాగర్, సలీంఖాన్, లతీఫ్, సుల్తాన్, సాయిలుయాదవ్, లక్ష్మయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శంకరసముద్రం ముంపు పునరావసం గురించి, ముంపు బాధితులకు న్యాయం చేయాలంటూ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీలో చర్చించడంపై కానాయపల్లి గ్రామస్తులు హర్షిస్తూ బుధవారం కొత్తకోటకు వచ్చిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కలిసి పూలబొకేను ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ప్లాట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. శంకరసముద్రం పనులు చేయించి కుడి కాలువ ద్వారా నీళ్లు పారించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భీమన్ననాయుడు, కర్ణాకర్‌రెడ్డి, రాములు ఉన్నారు.

వ్యవసాయానికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని దావాజిపల్లి, మాధరావుపల్లి, శాగాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని, పనుల వద్ద కూలీలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లోని మొక్కలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

నేడు ప్రతిష్ఠాపనోత్సవం



ముస్తాబైన ఆలయం

ఆత్మకూర్: మండలంలోని తూంపల్లిలో గురువారం శివపంచాయతన, ఆదిత్యాది నవగ్రహ, శిఖర, ధ్వజ గ్రామ నాభిశిల, బొడ్రాళ్ల ప్రతిష్ఠోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, ప్రతిష్ఠ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికంగా హాజరు కావాలని నిర్వాహకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి కోరారు.

ముగిసిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్



విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

వనపర్తిటౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఫిజికల్ సైన్స్‌ఫోరం, బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన పరీక్షకు మొత్తం 32 మంది విద్యార్థులు హాజరైనట్లు ఏఎంఓ మహానంది తెలిపారు. మొదటిస్థానంలో కె.జానకిరాం (టీఎస్‌ఎంఎస్, పెబ్బేర్), రెండోస్థానంలో నిఖిల్‌కుమార్ (జెడ్పీహెచ్‌ఎస్, తిప్పడంపల్లి, ఆత్మకూర్), మూడోస్థానంలో గౌతంచక్రి (జెడ్పీహెచ్‌ఎస్, వీపనగండ్ల) విద్యార్థులు నిలిచారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు, పరీక్షలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, మధుసూదన్‌రావు, బయోసైన్స్ అధ్యక్ష, కార్యదర్శులు టి.మల్లికార్జునుడు, మల్లేష్, జిల్లా కార్యవర్గసభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, నరేష్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాసులు, మోహన్ ఉన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అయి 26వ తేదీన ముగుస్తాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సత్యం, శ్రీనివాసులు, విజ్జయ్య, అర్చకుడు భవనాచార్యులు తెలిపారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు మాఘశుద్ధ పౌర్ణమి రోజు వరకు ఉంటుందని వివరించారు. నెల రోజుల పాటు జాతర కొనసాగుతుందని పేర్కొన్నారు. 22న స్వామివారికి గరుడ వాహన సేవ, 23న శ్రీదేవీ, భూదేవీ, వేంకటేశ్వర స్వామిల కల్యాణం, 24న రథోత్సవం, 25న అశ్వవాహన సేవ, 26న హంస వాహన సేవ, చక్రతీర్థం, బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com